# అధికారంలో లేకున్నా అందుబాటులో ఉంటా

## మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి

కొడంగల్, నవంబర్ 5: అధికారంలో లేకున్నా ప్రజలకు అందుబాటులో ఉండి సేవ చేస్తానని మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలను కలిసి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ప్రజలు మార్పును కోరుకున్నారని, ప్రజా తీర్పును స్వాగతిస్తూ కొత్త ప్రభుత్వానికి శుభాకాంక్షలు తెలిపారు. ఎన్నికల్లో కష్టపడ్డ ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. గడిచిన ఐదు సంవత్సరాల్లో కొడంగల్ నియోజకవర్గంలో 70 శాతం అభివృద్ధి పనులు పూర్తి అయ్యాయని, మరింత అభివృద్ధికి గాను ఇదివరకే మరో రూ.300ల కోట్ల నిధులు మంజూరు అయినట్లు తెలిపారు. కొత్త ప్రభుత్వం మిగిలిపోయిన అభివృద్ధి పనులు చేపట్టాలని తెలిపారు. కొడంగల్, కోస్గి మున్సిపాలిటీల అభివృద్ధికి గాను మరో రూ.20కోట్లు , 12 చెక్‌డ్యాంల నిర్మాణాలకు గాను రూ.56కోట్లు మంజూరైనట్లు గుర్తు చేశారు. కాంగ్రెస్ గెలిచిన వెంటేనే బొంరాస్‌పేట, మద్దూరు మండలాల్లో బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలపై దాడులకు పాల్పడినట్లు తెలిపారు. అదే విధంగా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంపై కూడా రాళ్లతో దాడికి పాల్పడినట్లు పేర్కొన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ప్రజల కోసం నిర్మించిందని గుర్తు చేశారు. ఈ


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి

సమావేశంలో మున్సిపల్ కౌన్సిలర్ మధుసూదన్‌రావు యాదవ్, రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ డైరెక్టర్ సలీం, బొంరాస్‌పేట మార్కెట్ కమిటీ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి, కొడంగల్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ శ్రీవాణి, జడ్పీ మాజీ వైస్ చైర్మన్ కృష్ణ, దౌల్తాబాద్ జడ్పీటీసీ కోట్ల మహిపాల్, కొడంగల్, బొంరాస్‌పేట, దుద్యాల పార్టీ మండలాల అధ్యక్షులు దామోదర్‌రెడ్డి, కోట్ల యాదగిరి, చాంద్‌పాషా, పర్సాపూర్ సర్పంచ్ సయ్యద్ అంజద్‌లతో పాటు బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న రోహిత్‌రెడ్డి

# ప్రజల పక్షాన ఉంటాం

## మీడియా సమావేశంలో మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి

తాండూరు, డిసెంబర్ 5: అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజా తీర్పును స్వాగతిస్తున్నామని, బీఆర్‌ఎస్ ప్రజల పక్షాన నిలుస్తుందని తాండూరు మాజీ ఎమ్మెల్యే పంజుగుల రోహిత్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం తాండూరులో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అధికారం, పదవులు ఎవరికీ శాశ్వతం కాదన్నారు. రాజకీయంలో గెలుపు, ఓటమి సహజమన్నారు. కార్యకర్తలు నిరాశ చెంద వద్దని వచ్చే స్థానిక సంస్థల ఎన్నికలకు ఇప్పటినుంచే సిద్ధం కావాలని సూచించారు. మొక్కవోని ధైర్యంతో ముందుకు వెళ్లి వచ్చే ఎన్నికల్లో బీఆర్‌ఎస్ సత్తా చాటాలన్నారు. గోడకు కొట్టిన బంతిలా మళ్లీ పుంజుకొని తాండూరులో బీఆర్‌ఎస్ జెండాను ఎగరవేద్దామన్నారు. చివరి రక్తం బొట్టు వరకు తాండూరులోనే ఉంటానని హామీ ఇచ్చారు. ఎల్లప్పుడు ప్రజలకు అందుబాటులో ఉంటూ బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ సూచనలతో నడుచుకుంటామని తెలిపారు. ఎమ్మెల్యేగా గెలుపొందిన మనోహర్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతూ తాండూరు అభివృద్ధి, ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. కాంగ్రెస్ ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్ని నెరవేర్చాలన్నారు. కొత్తగా ఏర్పడే ప్రభుత్వానికి తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని ప్రకటించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నేతలు శ్రీశైల్‌రెడ్డి, నయీం, జుబేర్‌లాల తదితరులున్నారు.

# రేపటితో కార్తీక మాస జాతర ముగింపు


ఉసిరి చెట్టు వద్ద దీపాలు వెలిగిస్తున్న మహిళలు

వికారాబాద్, డిసెంబర్ 5 : వికారాబాద్ పట్టణ సమీపంలో వెలిసిన అనంతపద్మనాభస్వామి ఆలయ కార్తీక మాస పెద్ద జాతర గురువారంతో ముగియనుంది. ఇందులో భాగంగా మంగళవారం ఆలయానికి భక్తులు చేరుకుని స్వామివారికి ప్రత్యేకపూజలు చేశారు. ఆలయ ఆవరణలో ఉన్న ఉసిరి చెట్టుకు మహిళలు పూజలు చేసి దీపాలు వెలిగించారు. స్వామివారిని దర్శించుకున్న భక్తులకు అర్చకులు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయ ఆవరణలో భక్తులు సేద తీరారు. ఈ సందర్భంగా భక్తులకు అన్ని రకాల సౌకర్యాలను ఆలయ అధికారులు ఏర్పాటు చేశారు.

# పంటసాగు పై రైతులకు అవగాహన


రైతులకు భూసార పరీక్షల ఫలితాల కార్డులను అందజేస్తున్న శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులు

ధారూరు, డిసెంబర్ 5: రైతులకు పంటల సాగుపై అవగాహన అవసరమని నూనెగింజల పరిశోధన సంస్థ ఇన్‌చార్జి శాస్త్రవేత్త దినేశ్‌కుమార్ అన్నారు. ప్రపంచ మట్టి దినోత్సవం సందర్భంగా మంగళవారం మండల పరిధిలోని గట్టేపల్లి గ్రామంలో భారతీయ నూనె గింజల సంస్థ ఆధ్వర్యంలో రైతులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భూసార పరీక్షల ఆధారంగా పంటలకు ఎరువులను వేసుకోవాలన్నారు. సూక్ష్మజీవుల ప్రాముఖ్యత, మట్టిలోని పోషకాలను కాపాడు కోవాలనే అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. భవిష్యత్తు తరాలకు సారవంతమైన భూమిని, నీటిని ఎలా అందించాలనే విషయాలను రైతులకు అందించారు.అనంతరం రైతులకు భూసార పరీక్షల కార్డులను అందజేశారు. ఈ కార్యక్రమంలో వికారాబాద్ డివిజనల్ వ్యవసాయ శాఖ అధికారి వినోద్‌కుమార్, ధారూరు మండల వ్యవసాయ అధికారి ఝాన్సీలక్ష్మి, శాస్త్రవేత్తలు సురేశ్, పద్మావతి, శాంత లక్ష్మి, క్షేత్ర సహాయకులు సౌజన్య, కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

# జాగ్రత్తగా ధాన్యం కొనుగోలు చేయాలి


కులకచర్లలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఏపీఎం శోభ

కులకచర్ల, డిసెంబర్ 5 : రైతుల నుంచి ధాన్యాన్ని కొనుగోలు చేయాలని ఏపీఎం శోభ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని సాల్వీడ్, కులకచర్ల ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించి నిర్వాహకులకు పలు సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతుల నుంచి వివరాలు సేకరించి అన్ని సరిచేసిన వెంటనే ధాన్యాన్ని కొనుగోలు చేయాలని సూచించారు. అలాగే తేమ శాతాన్ని పరిశీలించాలన్నారు. ధాన్యాన్ని తడువకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు.

### స్వయం సహాయక సంఘాల సమావేశాలు నిర్వహించాలి

స్వయం సహాయక సంఘాల సమావేశాలు సక్రమంగా నిర్వహించాలని ఏపీఎం శోభ అన్నారు. మంగళవారం కులకచర్ల మండల కేంద్రంలో స్వయం సహాయక సంఘం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాల సమావేశాలు ప్రతి నెలా రెండు సార్లు తప్పనిసరిగా నిర్వహించాలని సూచించారు. సభ్యులు తీసుకున్న అన్ని రకాల రుణాలను సక్రమంగా చెల్లించాలని, పుస్తక నిర్వహణ సక్రమంగా చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీసీ వెంకటయ్య, వీవోఏలు తదితరులు పాల్గొన్నారు.

# ధారూరు మెథడిస్టు క్రిస్టియన్ జాతర ప్రారంభం


మెథడిస్టు జాతరను ప్రారంభిస్తున్న బిషప్‌లు

ధారూరు, డిసెంబర్ 5: మండల పరిధిలోని ధారూరు స్టేషన్ మెథడిస్టు జాతరను మంగళవారం బిషప్ డాక్టర్ ఎంఏ డానియేలు, డాక్టర్ ఆశా డానియేలు, బిషప్ ఎన్ఎల్ కర్‌కరే ప్రారంభించారు. అనంతరం జాతర ముఖద్వారం నుంచి బిషప్‌లు, పాస్టర్లు పాదయాత్రతో వచ్చి ఏసుక్రీస్తు శిలువ వద్ద ప్రార్థనలు చేశారు. అనంతరం ప్రసంగించారు. జాతర ఏర్పాట్లను అధికారులు, ప్రజా ప్రతి నిధులు, జాతర కమిటీ సభ్యులు ఎప్పటికప్పుడు పరివేక్షిస్తున్నారు. పోలీసులు జాతర ప్రాంగణంలో ఎలాంటి ఆవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఏర్పాట్లు చేశారు.

# ఘనంగా తుల్జాభవానీ పూజలు



కులకచర్ల, డిసెంబర్ 5 : చౌడాపూర్ మండల పరిధిలోని వాల్యా నాయక్‌తండాలో మంగళవారం తుల్జాభవానీ మాత పూజలు ఘనంగా నిర్వహించారు. గ్రామంలో గిరిజనులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి నైవేద్యం సమర్పించారు. ఈ పూజల సందర్భంగా వారి బంధువులను పిలిపించుకొని అమ్మవారికి వివిధ రకాలుగా పూజలు నిర్వహించిన అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

# బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

పెద్దేముల్, డిసెంబర్ 5 : మండల కేంద్రానికి చెందిన బోయిని చంద్రప్ప కుమారుడు బోయిని అరవింద్ అనారోగ్యంతో మంగళవారం చనిపోయాడు. పెద్దేముల్ సొసైటీ చైర్మన్ ద్యావరి విష్ణువర్ధన్ రెడ్డి బాధిత కుటుంబానికి ఐదు వేల రూపాయల ఆర్థిక సాయాన్ని విష్ణు అన్న యువసేన సభ్యుల చేతులమీదుగా బోయిని చంద్రప్పకు అందజేశారు. కార్యక్రమంలో విష్ణు అన్న యువసేన సభ్యులు బోయిని నర్సింహులు, రవి కిరణ్, పిట్ల రాములు, బోయిని శ్రీకాంత్, రాజు, శివరాజు పాల్గొన్నారు.



వికారాబాద్, డిసెంబర్ 5: వికారాబాద్ మున్సిపల్ పరిధిలోని గుడుపల్లికి చెందిన పాండు రంగారెడ్డి సైబరాబాద్ లో ఏసీపీ గా విధులు నిర్వహిస్తూ అనారోగ్యంతో మృతి చెందాడు. స్వగ్రామం గుడుపల్లిలో పాండురంగారెడ్డి భౌతిక కాయానికి ఎస్పీ కోటిరెడ్డి పూలమాల వేసి, నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ధైర్యాన్ని అందించారు.

# భార్యను చంపిన భర్త

యాలాల, డిసెంబర్ 5: ఓ వివాహితను దారుణంగా హత్య చేసిన ఘటన మంగళవారం వెలుగులోకి వచ్చింది. వివరాలిలా ఉన్నాయి... తాండూరు పట్టణం సీతారాంపేటకు చెందిన అనసూయ(25)ను 12 సంవత్సరాల క్రితం అదే కాలనీకి చెందిన మ్యాతరి శాంతి కుమార్‌కు ఇచ్చి వివాహం చేశారు. వారికి నలుగురు మగ పిల్లలు పుట్టి చనిపోయారు. శాంతి కుమార్ తాగుడుకు బానిసై చిన్న చిన్న విషయాలకి భార్యతో గొడవ పెట్టుకొని కొట్టడంతో పాటు మరో పెండ్లి చేసుకుంటానని తీవ్రంగా హింసించేవాడు. సోమవారం సాయంత్రం ఏడున్నర గంటల సమయంలో ఇదే విషయమై గొడవ జరిగి అనసూయను కొట్టడంతో పాటు గొంతు నొక్కడంతో మృతి చెందింది. మృతురాలి అన్న శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తాండూరు పట్టణ సీఐ రాజేందర్ రెడ్డి తెలిపారు